# "శ్రీగణపతిని... సేవింపరారె...."

వి. పద్మప్రియ

ఈ సకల చరాచర జగత్తుకు అధినాయకుడు, లయకారకుడు, కన్నతండ్రి అయిన పరమేశ్వరుని గారాబు తనయుడు, అమ్మలగన్నయమ్మ, బంగారుతల్లి కాత్యాయనీదేవి కన్నులపంట, సర్వవిఘ్నాధిపతి అయినట్టి విఘ్నేశ్వరుని పండుగ రావుగారు ప్రతిఏడూ అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుతూ వుంటారు. ఆ చల్లనయ్యను తలుచుకోనిదే వారింట ఏ కార్యమూ ప్రారంభం కాదు, సిద్ధించదు!

రావుగారు లక్ష్మీపుత్రుడు, భాగ్యశాలి! అందువల్లనే పార్వతీతనయుని సేవ అంత వైభవంగా, అద్భుతంగా. నేత్రపర్వమొనరించు రీతిన ప్రతిఏటా జరప గలుగుతున్నారాయన.

"కమలాక్షునర్చించు కరములు కరములు – శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ" అన్నట్లుగా "విఘ్నేశు కర్పించు సంపద సంపద" అను భావంతో పులకించి తరిస్తారాయన.

నిప్పులు కురిపిన వేసవి చల్లబడింది. తొలకరి కమ్మగా చల్లగా జల్లులు చల్లింది. ఎండిన మోడులు ప్రాణం పోసుకున్నాయి. వానలు విజృంభించాయి. ప్రకృతి పరవశించింది. రావుగారి హృదయం కూడా పరవశించింది భాద్రపదం రాకతో!

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వినాయకచతుర్థి పర్వదినం దగ్గర కొచ్చేసింది.



ఈ ఏడు గణపతి కొరకు ప్రత్యేకంగా పసిడి మువ్వల వడ్డాణం, వెండి కిరీటం, నాగాభరణం, బంగారుగజ్జెలు తయారుచేయించారు రావుగారు.

వాటి సోయగం చూడవలసిందేగానీ వర్ణించనలవి కాదు. గులాబిరంగు కాగితాలలో చుట్టి, పట్టు గుడ్డల సంచీలలో అమర్చి, ధగధగలాడేట్టు నగిషీలు చెక్కి, మిల మిలలాడుతున్న ఆ ఆభరణాలను గంధపు పెట్టెలో భద్రపరచి, పదిలంగా అప్పగించిన కంసాలి వీరాచారికి ముప్పిరిగొన్న ఆనందంతో ప్రత్యేక బహుమతి కూడా యిచ్చి పంపారు రావుగారు.

ఎప్పుడెప్పుడు తన చేతులతో ఆ ఆభరణాలు గణపయ్యకు అలంకరిద్దామా ఎప్పుడెప్పుడు ఆ సుందర దృశ్యాన్ని కన్నులారా చూసి పులకించుదామా అని రావుగారి మనోశరీరాలు రెండూ కలవరించి తపించిపోతున్నాయి!

ఆ శుభదినం రెండురోజులున్నదనగా, వారి ఆస్థాన పురోహితుడు నారాయణశాస్త్రి వచ్చి, కాశీనుండి ఎవరో తెచ్చియిచ్చిన గంగాజలం భద్రంగా రావుగారికి అప్పగించి, "బాబుగారూ ఎంతవరకూ వచ్చింది పండుగ సంబరం" అన్నాడు.

"అంతా సిద్ధమే శాస్త్రిగారూ! ఆ రోజున మీరు సవ్యంగా రావటమొక్కటే ఆలస్యం" అన్నారు రావుగారు చిరునవ్వుతో.

"ఎంతమాట బాబుగారూ. భోజనమయినా మానతానుగానీ మీ యింట పూజ మానతానా? ఎల్లుండి ఉదయం ఆరుగంటలకల్లా యిక్కడ వాలనూ?" అన్నాడు శాస్త్రి వినయంగా. చేతులు ముకుళిస్తూ.

"అన్నట్లు చెప్పటం మరిచాను. మీ దంపతులకు, పిల్లలకు ఈ సంవత్సరం ప్రత్యేక సన్మానం ఏర్పాటు చేశాను. అంటే మరేమీ లేదు. మీకిరువురికీ పట్టు వస్త్రాలు, పిల్లలకు దుస్తులు కొని వుంచాము. ఆ రోజు పూజ ముగిసిన తర్వాత అవి మీకిచ్చి సంతోషపరచాలని మా అభిమతం" అన్నారు రావుగారు.

ఆ మాటలు వినగానే శాస్త్రిగారి ముఖం పద్మంలా కళకళ లాడిపోయింది. రావుగారి కాళ్ళమీద పడినంత పని చేస్తూ,

"ధర్మమూర్తులు. సాక్షాత్తు ఆ నారాయణ స్వరూపులేగానీ వేరొకటి కాదు. మీ చల్లని చూపువల్లే మా కుటుంబం మొత్తం పచ్చగా బ్రతుకుతున్నాం. రోజూ మిమ్మల్ని తల్చుకొని దీపం పెట్టుకోనిదే మేము భోజనం కూడా చేయమంటే అతిశయోక్తి కాదు బాబుగారూ!" అన్నాడు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిపోతూ.

"ఏమిటి శాస్త్రిగారూ భట్రాజు పొగడ్తలు! పూజ ఏర్పాట్లు యింకేమయినా మిగిలి వుంటే అవి చూడండి ముందు. అందరం కలసి ఆ దేవదేవుణ్ణి స్తోత్రం చెయ్యాలిగానీ, మనల్ని మనం పొగడుకోవడం దేనికండీ" అన్నారు రావుగారు మందలింపుగా.

"అలా అనకండి బాబూ! ఇంత మంచి మనసున్న తమరు భగవంతుడు కాక మరేమిటి? మీరు వద్దన్నా నాకు మిమ్మల్ని వేనోళ్ళ స్తుతించాలనే అనిపిస్తోంది.

సరే బాబుగారూ సెలవిప్పించండి. ఎల్లుండి ఉదయమే వస్తాను." అని వంగి నమస్కరిస్తూ నిష్క్రమించాడు శాస్త్రి.

రావుగారు వేయి కళ్ళతో ఎదురు చూసిన ఆ పర్వదినం రానే వచ్చింది.

తెల్లవారుఝామునుండే యింట రికార్డు చేయబడ్డ సన్నాయి సంగీతం మంద్రస్వరంలో శుభ్రప్రదంగా ప్రమోగసాగింది. అభ్యంగన స్నానాలాచరించే హడావిడిలో రావుగారి కుటుంబం మునిగి వుండగా, నౌకర్లు గృహాలంకరణ హడావిడిలో మునిగి తేలుతున్నారు. అంతక్రితమే శుభ్రంగా కడిగి, నాముతో అందంగా ఇల్లంతా రంగవల్లులు, ముత్యాలముగ్గులు తీర్చిదిద్దారు.

గణేశుని పూజాస్థలంలో రావుగారి ధర్మపత్ని స్వయంగా రంగు రంగుల పద్మాన్ని చిత్రించారు. అది బహు సుందరంగా శోభిస్తూ ఆ గది మొత్తానికే వింత అందం తెచ్చింది.

స్త్రీ సేవికలు గడపలకు పన్నీరు కలిపిన పసుపు రాసి, కుంకుమబొట్లు అలది గుమ్మాలకు నవనవలాడుతున్న మామిడాకు తోరణాలు గుమ్మటంగా అలంకరించారు.

బజారులో ఆ రోజు అమ్మిన పత్రిలో సగం రావుగారి యింటనే వుంది.

పూజకోసం అంటే ఎంత ఖర్చుకయినా వెనుకాడరాయన. పూజకు అవసరమయిన ప్రతి వస్తువూ అత్యంత శ్రద్ధతో భక్తిభావంతో తెప్పించి భద్రపరిచారు. పూజాసామాగ్రి కొఱకు ప్రత్యేకంగా వారింట ఒక గదినే కేటాయించారు.

ఆ సామాగ్రి ఒక రకము కాదు, అనేక రకములు.

అటుకులు, కొబ్బరి-పలుకులు, చిటిబెల్లము, నానుబ్రాలు, చెరుకు రసము, టెంకాయలు, పొన్నంటిపండ్లు, నేరేడు, మారేడు నెలవంక మామిళ్లు, పానకము, వడపప్పు, పనసపళ్లు, దానిమ్మ ఖర్జూర ద్రాక్షపండ్లు, తేనెలో మాగిన తీయమామిడిపండ్లు వీటితోపాటు ఉండ్రాళ్ళు, కుడుములు, కమ్మనినెయ్యి, ముద్దపప్పు బూరెలు గారెలు, నవకాయ పిండివంటలు, నవరస భక్ష్యాలు, పాయసము, జున్ను, మారేడు మాదీఫలంబులు, బత్తాయిపండ్లు, వెలగపండ్లు, ఓహో, ఒకటేమిటి? సర్వమూను! ఇవిగాక, వివిధ రకములయిన పూజాపత్రి!

శ్రీగంధము, కుంకుమాక్షతలు, తామర చంపకములు, మల్లెలు, మొల్లలు, మంచిచేమంతులు, తెల్లగన్నేరులు, మంకెనలు, పొన్నలు, కలువలు. మారేడు గన్నేరు, జిల్లేడు, దేవకాంచన, రేగు, దేవదారు, జాజి, బలురక్కసి, జమ్మి దాసాని పువ్వు, గరికె మాచీపత్రి, మంచిమొలక, అగరు గంధాక్షతలు, ధూప దీపాలు, తాంబూల పుష్పోపహారములు...

ఓహో! ఎంత వైభవమానాడు విఘ్ననాధునిది. సిరిదేవి పసిడిమువ్వల పట్టాలు ధరించి ఘల్లుఘల్లున రావుగారి గృహప్రాంగణమున నడయాడుచున్నదా అన్నంత శోభస్కరమై వున్నదానాడు వారి గృహం!

విఘ్నేశ్వర మందిరాలంకరణ కొఱకై ప్రత్యేకంగా ఒక మనిషిని పిలిపించారు.

అతడు అత్యంత శ్రద్ధపూని, రకరకములైన చిత్రవిచిత్రములైన ముత్యాల సరాలతో, పుష్పహారములతో, రంగులద్దిన పాలవెల్లితో, జిలుగు వస్త్రములతో పట్టుతెరలతో పన్నీరు జల్లిన పుష్పగుచ్ఛములతో, కర్పూర దండలతో, కాసుల పేరులతో, విద్యుద్దీపాలతో గణేశ పూజామందిరం అద్భుతంగా అలంకరించాడు. ...త్రాయి, వెలగపండ్లు కూడా ఆ అలంకరణలో పాలుపంచుకుని తమ జన్మ ధన్యమైనదనుకున్నవి.

ఆ ఉత్తమాలంకరణ తిలకించిన రావుగారి నేత్రాలు మంచుతో తడిసిన ఉదయ పద్మాలవలె ప్రకాశించాయి

రావుగారి సతీమణి కాంచనాదేవి నిలువెత్తు గంధపు పెట్టెలో హాయిగా నిద్రిస్తున్న నాలుగడుగుల గణపయ్యను నిద్రలేపి, పవిత్ర గంగాజలాలతో మంగళస్నాన మాచరింపించి, చీనిచీనాంబరములు కట్టబెట్టి, పూజావేదికపై ఆశీనుణ్ణి చేసి, అక్కడితో తమ బాధ్యత తీరిందన్నట్లుగా పాకశాలలోకి నిష్క్రమించారు.

రావుగారి ఏకైక కుమార్తె పదునైదేండ్ల ఈడుగల పద్మిని పసుపు కుంకుమ పిండి ముగ్గులు, వెండి సామగ్రితో వేదికను తీర్చిదిద్ది, పూజాసామగ్రి అన్నగారి సాయంతో అమర్చిపెట్టింది.

వెండి బొట్టుపెట్టె తెప్పించి, తెరచి, భద్రంగా దాచిన ముద్దులొలికే పసిడి మువ్వల వడ్డాణం, నాగాభరణం, గజ్జెలు, కిరీటం బయటకు తీసి, చేతులార, ప్రీతి దీర పార్వతీ తనయునికి అలంకరించి తృప్తిగా చూసుకున్నారు రావుగారు.

తన ముద్దు ముచ్చటగా జరిపించుకుంటున్న స్వామి వేయిరెట్లు కాంతితో ప్రకాశించాడు.

స్వామి వదనంపై చిఱునగవు ఎంత సుందరంగా వున్నదో! అంత మధుర దరహాసం, ఆ చల్లనిచూపు ఎలా వచ్చాయి తండ్రీ నీకు!

రావుగారు భక్తిపారవశ్యంతో పులకిస్తూ, కనులు తుడుచుకున్నారు. సమయం ఏడుగంటలు కావస్తోంది.

"ఈ నారాయణశాస్త్రి ఏమయినట్లు? పూజాసమయం సమీపిస్తుంటే ఒక ప్రక్క!" అని విసుక్కున్నారు మనసులోనే. అదే సమయానికి నారాయణశాస్త్రి కుమారుడు పన్నెండేళ్ళవాడు రొప్పుతూ, వగర్చుతూ పరిగెత్తుకొచ్చి,

"నమస్కారం బాబుగారూ! నాన్నకి హఠాత్తుగా జబ్బు చేసింది. ఒళ్ళంతా చెమటలు పట్టి. తల తిప్పి, గుండెదడతో కింద పడిపోయారు. డాక్టరుగారు చూసి యింజక్షను యిచ్చారు. కళ్లు మూసుకుని అలాగే పడుకొని వున్నారు. ఈ విషయం మీకు తెలియపరచి, ఏమీ అనుకోవద్దని మరీ మరీ చెప్పమన్నారు" అన్నాడు.

రావుగారు హతాశులయి.

"ఓరి నీ యిల్లు బంగారంగాను! అంతా సిద్ధం చేసుకోగానే యిలా అయిందేమిటి? ఇప్పుడు ఉన్నట్టుండి వేరే పురోహితుడు ఎక్కడ దొరుకుతాడు?" అన్నారు కోపంగా చూస్తూ.

ఆ కుర్రవాడు వినయంగా,

"చిత్తం బాబుగారూ! మీకు యిబ్బందేమీ లేదు. పురోహితుణ్ణి వెంటపెట్టుకొనే వచ్చాను. ఆయన పేరు రామశాస్త్రిగారు. మా యింటి ప్రక్కనే వుంటారు." అన్నాడు. రావుగారి గుండె కుదుటబడింది.

"ఏరీ ఆయన?" అంటూ వరండాలోకి వచ్చి చూశారు. అక్కడ చేతిలో చిల్లులుపడ్డ సంచితో, మాసిన పంచెతో, కుష్కించిన దేహంతో ఒదిగి ఒదిగి వినయంగా, దైన్యంగా నిలబడ్డ అరవయ్యేళ్లు దాటిన ఒక వృద్ధ బ్రాహ్మణుడు రావుగారిని చూడగానే వినమ్రంగా చేతులు జోడించి.

"తమరి గురించి నారాయణశాస్త్రి చెప్పని రోజుండదు బాబుగారూ! తమ యింట యిలా అనుకోకుండా పూజ చేయించే అదృష్టం దక్కినందుకు నాకెంతో ఆనందంగా వుంది" అన్నాడు.

రామశాస్త్రి అవతారం యిబ్బంది కలిగించినా తప్పనిసరిగా దాన్ని అణుచుకుని.

"రండి లోపలికి. స్నానంచేసి పూజ ప్రారంభించండి" అని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయారు రావుగారు.

"పూజ బాగా చేయించండి శాస్త్రిగారూ! ఏమాత్రం లోపం వచ్చినా బాబుగారు సహించలేరు సుమా!" అంటూ నారాయణశాస్త్రి కొడుకు ఒక సలహా లాంటి హెచ్చరిక చేసి వెళ్ళిపోయాడు.

రామశాస్త్రి బావివద్ద చన్నీళ్ళ స్నానంచేసి, తడిబట్ట కట్టుకొని, సూర్య భగవానుడికి ఒక నమస్కారం ఆచరించి లోనికి వచ్చారు. విఘ్నేశుడి పూజా




మందిరం చూసి పులకించిపోతూ. అప్రయత్నంగా రెండుచేతులూ ఎత్తి దణ్ణం పెట్టాడు.

"ధన్యులు బాబుగారూ తమరు! భగవంతుడిచ్చిన సిరిసంపదలు ఆ భగవంతుని సేవకై యింత వైభవంగా వెచ్చించటం...అహా! ఎంత కన్నుల పండుగగా ఉందిః" అన్నాడు భక్తి నిండిన కంఠంతో.

రావుగారు తెల్ల పట్టుపంచె, తెల్ల లాల్చీ ధరించి, వచ్చి పీటపై కూర్చున్నారు. పిల్లలిద్దరు కూడా తమ పుస్తకాలు తెచ్చుకొని, వాటిపై పసుపు శ్రీకారం చుట్టి గణపయ్యవద్ద వుంచి, తాము వేసుకొన్న ధరగల దుస్తులు నలుగకుండే విధంగా తెల్లటి బట్టలు పీటలపై వేసుకొని, వాటిపై బుద్ధిగా కూర్చుని పూజ ప్రారంభం కోసం ఎదురు చూడసాగారు.

కాంచనాదేవి ఒకసారి ఆ గదిలోకి తొంగిచూసి, తృప్తిగా పూజాలంకరణ పరికించి, తిరిగి లోనికి వెళ్ళిపోయారు.

రామశాస్త్రి తాను కూడా పీటపై కూర్చోబోయి, ఆగి, "ఇప్పుడే వస్తాను బాబూ" అంటూ పెరట్లోకి వెళ్ళి. ఖళ్ళు ఖళ్ళుమని రెండు నిముషాలు దగ్గి, నోరు శుభ్రం చేసుకొని వచ్చాడు. అసహనంగా చూస్తున్న రావుగార్ని చూసి సంజాయిషీ యిస్తున్నట్టుగా,

"ఆరునెల్లనుండీ పట్టుకొంది బాబుగారూ పాడుదగ్గు. వచ్చిందంటే ఒక పట్టాన వదలదు, రెండురోజులనుండీ వేడిచేసి గావును మరీ బాధపెడుతోంది" అని, కూర్చుని,

"కృష్ణకృష్ణా" అనుకుంటూ కుంకుమ తీసి కనుబొమలు మధ్యపెట్టుకొని, పసుపు విఘ్నేశ్వరుణ్ణి చేసి, కొబ్బరిపాలతో అభిషేకం చేస్తూ పూజ ప్రారంభించాడు.

పుస్తకం తెరిచి చదువుతూ, తను చదివే పవిత్ర శ్లోకాలకు అనుగుణంగా రావుగారిచేత, పిల్లలచేతా పూజ చేయించసాగాడు. ఆ వయసులో కూడా ఆయన కంఠం సుమధురంగా, గంభీరంగా ధ్వనించటం ఒక విశేషం.

"శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్, ప్రసన్నవదనం ధ్యాయే...సర్వవిఘ్నోప..." పూర్తి చేయకుండానే దగ్గు తెర వేగంగా ఆయన గళాన్ని చుట్టుముట్టింది.

రెండు నిముషాలకు తెప్పరిల్లి—మళ్ళీ చదవసాగాడు.

"సుముఖశ్చైక దంతశ్చ, కపిలో గజకర్ణక, లంబోదరశ్చ.

వికటో, విఘ్నరాజో గణాధిపః"...ఖళ్ళు ఖళ్ళు ఖళ్ళు ఖళ్ళు...

మళ్ళీ చదవటానికి ప్రయత్నిస్తున్నాడు అతి కష్టంమీద దగ్గును, ఆయాసాన్ని అణుచుకుంటూ!

"ధూమకేతుర్గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః వక్రతుండ శ్శూ... శ్శూ...ర్ప కర్ణో..." ఖళ్ళు ఖళ్ళు ఖళ్ళు ఖళ్ళు...మళ్ళీ ఊపిరాడకుండా దగ్గు! ఆయన నాలుక బైటకు వచ్చేసింది. గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి. పుస్తకం పెట్టి, గుండెలు నిమురుకుంటూ, ముందుకు వంగి పేగులు తెగిపోయేలా దగ్గసాగాడు. నిశ్చేష్టులయి చూస్తున్న రావుగారికి, పిల్లలకు ఆ దృశ్యం బీభత్సంగా కనిపించింది. రావుగారి కనులు, వదనం అసహనంతో, భరింపరాని విసుగుతో కుంచించుకుపోయాయి. మధురగాన ప్రవాహంలో అపశృతిపలె, పవిత్రంగా కొనసాగవలసిన తమ ఆరాధ్యదైవం పూజాకార్యక్రమంలో దారిద్ర్యదేవత మూర్తీభవించినట్టున్న ఆ బ్రాహ్మణుడి కర్ణకఠోరమైన గళకింకారం మహాపచారంవలె, భయంకర తప్పిదంవలె కనపడిందాయనకు. అత్యంత వైభవంగా జరిపించాలని కలలు కన్న ఈ పర్వదినం, పూజావిశేషం ఒక రోగిష్టి ముసలి అసమర్థ బ్రాహ్మణుని వల్ల నిర్వీర్యమై, నిర్వీరపోతున్నందుకు రావుగారి హృదయం భగ భగ మండిపోయింది. కళ్ళు మంకెనలయ్యాయి! వెన్నలాంటి స్వరం కరకుతనాన్ని ఆపాదించుకుంది. వేలితో గుమ్మంవైపు చూపిస్తూ.

"వెళ్ళండి వెళ్ళి బయట కూర్చోండి" అన్నారు మేఘం గర్జించినట్లు. రామశాస్త్రి నీళ్ళు కారుతున్న కళ్ళు తుడుచుకుంటూ, "ఫర్వాలేదు బాబుగారూ!" అని ఏదో చెప్పబోయాడు.

"ఏమిటి ఫర్వాలేదు వైభవంగా జరగవలసిన పూజంతా భగ్నమయిపోయింది. ఆయాసంతో, దగ్గుతో ఆవసానదశలో వున్నట్లుగా వున్న మీరు ఏం నిర్వాకం చేద్దామని యిక్కడకు వచ్చినట్లు? అయినా మిమ్మల్నని ఏం ప్రయోజనం? మీలాంటివాణ్ని పంపి పూజ నాశనం చేసిన ఆ నారాయణశాస్త్రి ననాలి. ఇంకా చూస్తూ నిలబడ్డారేః వెళ్ళండి!" తీక్షణంగా చూస్తూ అరిచినట్టే అన్నారు రావుగారు.

రామశాస్త్రి ముఖం పాలిపోయింది. గాయపడ్డ హృదయంతో, వెర్రిగా రావుగారివైపు చూసి, తడబడుతున్న అడుగులతో బయటకు వెళ్ళిపోయాడు.

రావుగారి ఆవేశం తగ్గటానికి పావుగంట పట్టింది. కానీ ఏదో చెప్పరాని బాధ. వెలితి మాత్రం ఆయన మనసుని దట్టంగా కమ్ముకున్నాయి. యాంత్రికంగా పుస్తకం అందుకొని, అలవాటులేక తడబడుతున్న ఉచ్చారణతో కొన్ని మంత్రాలు కథ చదివి ఎలాగో పూజ సమాప్తం చేశారు. పిల్లలు అక్షింతలు వేసుకొన్నారు. కాంచనాదేవి వచ్చి మంగళహారతి యిచ్చి, విఘ్నేశునికి భక్ష్యాలు నైవేద్యం సమర్పించి, అందర్నీ భోజనాలకు రమ్మని పిలిచి, వెళ్ళారు.

రావుగారు వరండాలోకి వచ్చారు రామశాస్త్రిని పిలవటం కోసం! అక్కడ స్థంభానికి ఆనుకొని శూన్యంలోకి చూస్తూ నిలబడి వున్నాడు రామశాస్త్రి. రావుగార్ని చూడగానే నమస్కరించి, "ఇక వెళ్తాను బాబుగారూ సెలవిప్పించండి" అన్నాడు తల వంచుకొని. "అదేమిటిః భోజనం చేసి వెళ్ళండి" అన్నారు రావుగారు గాభరాగా.

"వద్దు బాబూ! నేను చేసిన ఘనకార్యానికి అది కూడా ఎందుకుః అత్యంత శోభస్కరంగా జరుగవలసిన మీ పూజని నా పాపిష్టి దగ్గుతో నాశనం చేసినందుకే ఎంతో కుమిలిపోతున్నాను...ఇంకా నన్ను భోజనానికి పిలిచి మరింత బాధపెట్టకండి. నేను చేసిన అపరాధానికి నన్ను క్షమించండి బాబుగారూ! పెద్ద వయసు మీదపడ్డా, బాధ్యతలు యింకా వదలకపోవటంతో అనారోగ్యాన్ని లెక్కచేయకుండా, దురాశతో యిలా వచ్చాను. బాబూ! మీరిచ్చే డబ్బుతో నాలుగు రోజులు మనవళ్ళకి, మనమరాళ్ళకి తిండిపెట్టవచ్చన్న పేరాశతో మీ పవిత్రమైన పూజని నాశనం చేసిన నీచుణ్ణయ్యాను. మన్నించండి బాబూ" అన్నాడు రామశాస్త్రి గాజుగోళాల్లాంటి కళ్ళు చిరిగిన కండువాతో అద్దుకొంటూ.

మూర్తీభవించిన దైన్యంలా, అతి కరుణామయంగా, బక్కచిక్కిన దేహంతో తనముందు నుంచుని ఆర్ద్రనయనాలతో చూస్తున్న ఆ వృద్ధుని రూపం రావుగారి మనసుని కలచివేసింది.

అంతవరకు ఆయనని ఆవరించిన విసుగు, అశాంతి మంచులా కరిగిపోయి. హృదయం ద్రవించింది. పశ్చాత్తాపంతో మనస్సు కలుక్కుమంది. వెంటనే రామశాస్త్రి చేతులు పట్టుకొని చలిస్తున్న స్వరంతో,

"అంత మాట అనకండి! నిజానికి మీరే నన్ను క్షమించాలి విసుగులో ఏవేవో అన్నాను. అవేమీ మనసులో పెట్టుకోకండి. పూజదేముంది? ప్రతిఏడూ వస్తూనే వుంటుంది. ముందు ఆరోగ్యం ప్రధానం. ఇంత దగ్గుతో నీరసంతో బాధ పడుతూ కూడా డాక్టరు దగ్గరకు వెళ్ళినట్టుగా లేదే మీరు?" అన్నారు బాధగా చూస్తూ.

నిర్లిప్తంగా నవ్వాడు రామశాస్త్రి.

"ఎలా వెళ్ళమంటారు బాబుగారూ! తిండికే గతిలేదు. ఏ పూటకాపూట ఎలా గడుస్తుందా అన్న బెంగతో కృంగే మాలాటివారికి వైద్యానికి వెళ్ళేంత స్తోమతు ఎక్కణ్నించి వస్తుంది? నా కూతురు భర్తను పోగొట్టుకొని, రోగిష్టిదయిపోయి నలుగురు పిల్లలతో నా దగ్గరే ఉంటోంది. దాని సంసారాన్ని పోషించ డానికి నేను పడుతున్న పాట్లు అన్నీ యిన్నీ కావు. ముసలితనం! జవసత్త్వాలు ఉడిగిపోయాయి. అయినా బ్రతుకు భారాన్ని దించుకోలేక, నాలుగిళ్ళు తిరిగి యాయవారం చేస్తున్నాను. కానీ రోజంతా తిరిగినా నాలుగు గింజలు రాలటం కష్టంగా ఉంది. మనుష్యుల్లో దయ నశించిపోయింది బాబుగారూ! ఇప్పుడు చెప్పండి ఇలాంటి స్థితిలో ఉన్న నాకు వైద్యమేమిటి? నాలాంటివాడికి మరణ మొక్కటే మందు బాబుగారూ!" రామశాస్త్రి కండువాలో ముఖం దాచుకొని కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. తన తండ్రి వయసున్న ఆయన అంత దీనంగా రోదిస్తుంటే అసలే వెన్నలాంటి రావుగారి మనసు ఝంఝూమారుతం తాకిన మల్లె తీగలా అల్లల్లాడిపోయింది. ఆయన కనులు నీటితో నిండిపోయాయి. బరువెక్కిన గుండెను సవరించుకొంటూ రామశాస్త్రి భుజం మీద చెయ్యివేసి తడుతూ,

"ఊరుకోండి శాస్త్రిగారూ వూరుకోండి! బాధపడకండి కష్టాలు కలకాలం ఉండవు. దేవుడు కరుణామయుడు. అందువల్లనే మీరీరోజు మా యింటికి రావటం తటస్థించిందేమో! ఇక మీరు నిశ్చింతగా ఉండండి. మీ బాధ్యతంతా నాది. అనారోగ్యానికి, దారిద్ర్యానికి దేనికీ మీరిక జడవవలసిన పనిలేదు. నన్ను మీ కుమారుడుగా భావించి మీ భారం నాకు వదిలేయండి. ఈనాటినుండి మీరే మా యింటి పురోహితుడు. మీకే లోటూ రాదు. దేవుడి సేవకోసం వేలకువేలు ఖర్చు పెట్టే నేను దీనులకోసం ఏమీ చెయ్యలేని రిక్తహస్తుణ్ణి కాను. కాకూడదు కూడాను. రండి! లోపలికి రండి! కడుపునిండా భోంచేసి, అమ్మాయికీ పిల్లలకూ కూడా తీసుకెళ్ళండి! రండి!" అని ఆప్యాయంగా ఆహ్వానించారు రావుగారు.

రామశాస్త్రి దైవసాక్షాత్కారం లభించినవాడిలా పులకించిపోతూ, మితి మీరిన కృతజ్ఞతా భారంతో చప్పున వంగి రావుగారి పాదాలు తాకబోయాడు.

"అయ్యో! అదేంపని పెద్దవారు! లేవండి" అని వారించి, వణుకుతున్న ఆయన చేయి పట్టుకుని భోజనం దగ్గఱకు తీసుకొచ్చారు రావుగారు.

రామశాస్త్రి ముందున్న విస్తట్లో విఘ్నేశ్వరుని కోఱకు చేసిన సమస్త భక్ష్యాలూ వున్నాయి. తడితడిగా వున్న కళ్ళు తుడుచుకుంటూ, కంపిస్తున్న చేతితో ముద్దలు కలుపుకొని తృప్తిగా తినసాగాడు రామశాస్త్రి.

రావుగారికి ఆ దృశ్యం హృద్యంగమంగా వున్నది. ఏ పూజా యివ్వలేని తృప్తి, ఏ వైభవమూ యివ్వలేని ఆనందం ఆనాడు ఆ సన్నివేశం రావుగారి మనసుని మధురానందంతో నింపుతోంది

ఆయన కనులకి రామశాస్త్రి రామశాస్త్రిలా కాక, తన పూజను మెచ్చి, తన యింటికి వచ్చి, పీటపై కూర్చుని, అలవోకగా చూస్తూ చిరునవ్వుతో భక్ష్యాలు, కుడుములు భుజిస్తున్న తన ఆరాధ్యదైవం, బంగారుతండ్రి బొజ్జగణపయ్యవలె కనపడ్డ అయన తనువు, మనసు ఏకకాలంలో పులకాంకితమయినాయి!!

# విరహిణి రాధ

## శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

అర విరిసి కొన్న మధుసుధాధరము లందు
అల నగతి చిందు లాడెడు కలికి నగవు-
తలిరు బుగ్గలు, చూర్ణకుంతలపు గుములు-
అలిక కమ్మని కస్తూరి తిలక శోభ-
కజ్జలపు నీలిముల ఓరగంటి చూపు-
సిగపై పింఛము, కేలగ్రోవి, చెవి సుస్నిగ్ధార్ద్రకల్హారముల్
మగతళుక్కల్ వెలుగొందు కౌస్తుభమణి భ్రాజిష్ణు వక్షస్థలిన్
ధగధగ్ధగచులున్, పదద్వయిని శింజాయుక్త మంజీరముల్
జగతీమోహన సుందరాంగుడ తస్కర్త్రాణమీ ధాత్రిలో-
అతడే నేను నేనే అతడుగా ఇన్నాళ్లు
తిరిగినాము బృంద దినము రాత్రి
ఇప్పుడాతడెటకో ఏగినాడట నన్ను
విరహ బాడబాగ్ని మరుగద్రోసి!
యమునా కూల విశాల సైకతములం దాగోపుదున్ నేను
నున్
కమనీయాముల పూర్ణచంద్ర రజనీ కమ్రానిలా భంగ భం
గములన్ తీర్చిన రాసకేళి గడియలో నా గుండె లోలో
తులం
దు మహోగ్రాహోల గుంపులట్లు నటియించున్ భీదమై
క్రూరమై!
మరువజాలను వాని మధురాంగుళుల స్పర్శ-
తలపైన పులకలే నిలువుటొడల!
చెరిగిపోదీ ఎదతెర వాడు కౌగిట
బిగియించి బుగ్గల పెట్టు ముద్దు।
కరిగి పోదతడు నా తరుణాధరముల తే
నియల తీయని సోన నింపు స్మృతులు!
తనువు లేకమ్మైన ఘనముహూర్తానంద
భరమెన్ని నాళ్లైన మరుపురాదు!
కాలు నిలువ బోదేదియు కాదుచేత-
తోడు విడివడి కాంతికి దూరమగుచు
అడవిలో గజిబిజి తీగలందు దారి
తెన్ను తెలియని అతి పరిదీన నేను।

